
# కనువిప్పు

**మనోహరాదేవి**



**దిగ్గున లేచింది చిత్ర—**

**తనకొచ్చిన కల నోసారి జ్ఞాపకానికి తెచ్చుకొనే ప్రయత్నం చేసింది.**

ఎంత చిత్రమయిన కల. ఈ కలని తనరూం మేట్ మేఖలకి చెప్తే-అది మహా హుషారుపడి పోతుంది. అలాంటి అనుభవాన్ని ఒక్కసారైనా చవిచూడ్డానికి ఏ మాత్రం వెనుకాడదు. మేఖల విచ్చలవిడితనం తనకితెల్సు. కాని అలా నిజ జీవితంలో జరిగే ఆస్కారం వుందా!

మేఖల లేవనే లేచింది. 'ఏమిటోయ్ ... అప్పుడే లేచావ్ ఏమిటి విశేషం. ఏ రాజకుమారుడైనా కలలో కన్పించి నిద్ర పాడుచేశాడా'' అందికళ్ళు నులుముకొంటూ. చిత్ర బెడ్ దగ్గరగా వచ్చి టేబిల్ లైట్ ఆన్ చేసి టైం చూసింది. నాలుగవుతోంది. ఇంకా తెల్లవారడానికి రెండుగంటలు కావాలన్న నిజం మళ్ళీ నిద్ర మత్తునిచ్చింది.

మేఖలకి—'నే పంటానోయ్—నాకింకానిద్ర సరిపోలా' మేఖల తన బెడ్‌వైపు నడవబోతుండగా చిత్ర చీరకొంగును పట్టుకునాపి ''ఆగు, నీ నిద్రని కాస్త రేపు రాత్రి కోసం వాయిదావెయ్యిగాని......నా కిప్పుడొచ్చిన కలగురించి చెప్తా—కాస్తవిను.''

''రోజూ నీ కలలు వింటూ నా నిద్రపాడు చేసుకోవడానిక్కాదు ... నేనీ హాస్టల్లో చేరుతా...తిని ... చదివి ...పడుకోడానికి తెల్సా'—మేఖల తన మామూలు ధోరణిలో అంది.

'ఏడిశావ్‌గాని—ఈకల రోజూమాదిరి కలలాంటిదకాదు. ఇది విన్నాక నువ్ ఆ అనుభవం నిజమైతే బావుణ్ణని ఆశపడ్తావ్'' దాక్

లేట్ దాచిపెట్టుకొన్న చిన్నపిల్లాడి మొఖం పెట్టి అంది చిత్ర.

'అయితే—ఏమిటో చెప్పేయ్ విందాం.'

"కాని నాకో అనుమానమే! ఇలాంటి ప్రదేశాలు ప్రపంచంలో ఎక్కడైనా వుంటాయంటావా" అనుమానించడం చిత్ర జన్మహక్కు అనుకొంది మేఖల.

"నాకు తెల్సు...నీ బుర్ర చాలా చిన్నదని. ప్రపంచంలో లేనిదంటూ ఏదైనా వుంటే అది నీ బుర్రతప్ప ఇంకేం కాదు. ఊ! చెప్పు అసలు కలేమిటో" మేఖల ఎప్పుడూ ఇంతే. ఏ విషయాన్నీ సీరియస్‌గా ఆలోచించదు.

ప్రతి విషయమూ కొట్టిపారేసినట్టే చూడడం అలవాటై పోయింది.

"కల చెప్పాకగాని తెలీదు నేనెందుకలా అన్నానో, కనీసం అలాంటి కల నాకయినా వొచ్చింది కాదనుకొంటావ్" చిత్ర వూరిస్తూ అంది.

చాల్లేగాని అసలుసంగతి మొదలెట్టిఏడూ!

* * *

"ఓస్! ఇంతేనా - అలాంటి ప్రదేశాలు ప్రపంచంలో లేవని ఎలా అనుకొన్నావ్ బోలెడు ఈ మధ్య పేపర్లో చూశా—ఓ అమెరికన్ యువతి మగవారితో వ్యభిచార గృహం నడపడాన్ని పోలీసులు నిషేధిస్తే ఆవిడ కోర్టుద్వారా అనుమతి తెచ్చుకొంది. కోర్టువారు నిక్షేపంగా ఆడవాళ్ళతో వ్యభిచార గృహం నడపడమెలా న్యాయమో—మగవాళ్ళతో నడపడమూ అలాగే న్యాయం అన్నారట, ఏమంటావ్? వేద్దామా అమెరికాకు ఓ ట్రిప్-మేఖల ప్రపంచజ్ఞానానికి ఆశ్చర్యపోయింది చిత్ర. అందుకే దానికింత ధైర్యం. ప్రతి విషయాన్ని మామూలుగా తీసుకోవడం అందుకే సాధ్యం అనుకొంది చిత్ర.

"నిజం! అయితే అమెరికాలో అలాంటి వున్నాయంటావ్!"

ఉన్నాయండమేమిటీ-ఉంటేనూ. అదికాదు గాని...మనదేశంలో మాత్రం పురుషులంతా, ఓ విధంగా, పురుషులతో నడపవడే వ్యభిచార గృహాల్లోని వాళ్ళకి ఏవిధంగా తీసిపోతారంటావ్? చిత్ర తన ఆలోచనా శక్తిని తిట్టుకొంది. తన వూహా శక్తికి ఎందుకింత వూకదంపుడు? మేఖలకెలా అలాంటి సరికొత్త ఆలోచనలు వస్తుంటాయో చిత్రకెప్పుడూ పజిలే.

"ఏమోనే. నీకు తెల్సు నేనేమాత్రం బుర్రగలదాన్నో. ఎందు కడుగుతావ్ గాని చెప్పేయ్.

చెప్పనా! మనదేశంలో ... కట్నం తీసుకొంటున్న ఈ పురుషుల్ని మనం డబ్బిచ్చి కొనుక్కొంటున్నట్టంటావా కాదా?

"అవును.. ?"

"మరి అలాటప్పుడు - వాళ్ళని కొనుక్కోవడమంటే వాళ్ళు మనకి వాళ్ళ శరీరాల్ని అమ్ముతూ మనకి శరీర సౌఖ్యం కల్గిస్తూ - ఓ విధంగా వ్యభిచారులు కాలా?

మేఖల ఎంత పచ్చిగానైనా ఆలోచించగల్దు. అయినా దీన్ని నిజం కాదనిమాత్రం ఎవరనగలరు? చిత్రకాలోచించి చూస్తే నిజమేననిపించింది.

* * *

సెలవలకింటికొచ్చిన చిత్రకు ఇంట్లో మిత్రక్కయ్యనూ, బుజ్జిగాడిని చూసేసరికి ఎక్కడలేని ఆనందం ముంచుకొచ్చింది. బుజ్జిగాడ్ని ఎత్తుకు ఎంతసేపు ముద్దాడిందో తనకే తెలియదు. కాని అక్కయ్య మాత్రం ముభావంగా వుండడంలో అంతరార్థం ఏమిటో చిత్రకెంతకూ అర్థం కాలేదు.

పెళ్ళయిందగ్గర్నించీ నాన్న ఎన్ని వుత్తరాలు రాసినా, అమ్మను చూడాలనుందనీ ఆరోగ్యం బాగులేదనీ ఎలా రాసినా పంపించని విశ్వేశ్వర్ బావ రెండు సంవత్సరాల తర్వాత ఎలాగోలాగు పంపించాడల్లే వుంది. మరి మిత్ర సంతోషంగా వుండొద్దూ. ఎందుకీ ముభావం? మిత్రక్కయ్య నడిగెయ్యాలి అసలు సంగతేమిటో! ఏదో వుండే వుంటుంది. లేకపోతే ఎంతో వుల్లాసంగా వుండే స్వభావంగల మిత్ర ఇలా మారిపోయిందేమిటి?

*　　*　　*

ఇదన్నమాట అసలు కారణం: బావెంత నీచుడు. ఛీ! లెక్చరర్ చేస్తున్న తనే సంస్కార రహితంగా ప్రవర్తిస్తే మరి... అసలు చదువుకోని వాళ్ళ సంగతేమిటి? ఈయనకి మంచిగా బుద్ధి చెప్పాలి. ఎలా అయితే బావుణ్ను, బాగా ఆలోచించిన చిత్ర ఓ వుత్తరం రాసింది. విశ్వేశ్వర్ కి. దీంతో అటో ఇటో తేలిపోవాలనే వుద్దేశ్యంతోనే మొండి ధైర్యంతో రాసింది చిత్ర. పోస్టు చేసే ముందు ఓసారి మళ్ళీ చదివింది.

'మిష్టర్ విశ్వేశ్వర్......

నువ్వు బావ అని నా చేత పిలిపించుకునే అర్హతను అక్కయ్య నిక్కడికి పంపించిన క్షణాన్నే పోగొట్టుకున్నావ్. మిత్ర ఎంత నెమ్మదిగలదో ఎంత మంచిదో నీలాంటి వాడికెలా అర్థమవుతుంది. అయినా నీకు జీవితం పంచుకొనే సహధర్మచారిణికాదు గదా కావల్సింది. డబ్బు కుమ్మరించే కుబేర పుత్రికావాలట్టుంది. నీకు పెళ్ళిలో ఇచ్చిన 10 వేలు కట్నంగాక అప్పుడు తప్పని పరిస్థితి కాబట్టి ఇంకా ఐదు వేలు ఇస్తానని మా నాన్న ఒప్పుకోలేదనీ మేం అనం. కానీ నీవు ఇంత సంపాదిస్తూ, ఇంత జ్ఞానం వుండే... ఆ ఐదువేలకోసం మిత్ర నింటికి పంపకుండా... ఈ రెండు సంవత్సరాల్నుండీ ఉత్తరాలకు జవాబు వ్రాయకుండా... ఇప్పుడు ఆ డబ్బేదో తెస్తేనేగాని మళ్ళీ తిరిగిరావొద్దన్నావట. ఏవిటి నీ ఉద్దేశ్యం. మగవాడు వదిలేస్తే స్త్రీ బ్రతకలేదనా! చాలా అమాయికుడివి విశ్వేశ్వర్. అది బి. ఏ పాసైంది. ఎక్కడో చిన్న వుద్యోగం సంపాదించుకొని బుజ్జిగాడ్ని పెంచకపోదు. అసలు ఆ సంగతి వదిలిపెట్టు. నీకిచ్చిన పదివేల లెక్కేదో చూద్దాం. ఈ రెండు సంవత్సరాలు అది నీకు చేసిన వెట్టి చాకిరికి నీవు దాన్ని పోషించాననుకొంటే ఇక నీవు దానికి ఈ రెండు సంవత్సరాలుగా ఇస్తున్న శరీర సౌఖ్యం అంటే నువ్వు నీ శరీరాన్ని అమ్ముకొన్నందుకు రోజుకు 10 రూపాయల లెక్కగట్టినా రెండు సంవత్సరాలకు 7200రూపాయలు నీకివ్వాల్సి వుంటుంది. (నువ్వు రెండు సంవత్సరాలు ప్రతిరోజూ దానికి శరీర సౌఖ్యం ఇచ్చి వుండవ్ అయినా ఆ రోజుల్నేం తీసేయడం లేదు భయపడకు) ఆ డబ్బు పోగా మిగిలిన2800 రూపాయలు తిప్పి పంపడానికి నీకెలాంటి అభ్యంతరం వుండదనీ నువ్వు చదువుకొన్నవాడివి కాబట్టి ఈ మాత్రం అర్థం చేసుకోగలుగుతావనీ మర్యాదగా ఆ డబ్బు త్వరలో పంపి కనీసం ఆ మాత్రం నీతయినా వుందనిపించుకుంటావని ఆశిస్తూ— చిత్ర.

మిత్రకి - మిత్ర అమ్మా నాన్నలకి ఏ సంగతీ పాలుపోలేదు విశ్వేశ్వర్ ఇంత తొందరగా ఎలా మారగలిగాడో చోద్యంగా వుంది ఆ వుత్తరం చూస్తే! డబ్బు విషయం ఎత్తకుండా మిత్రను ఆదివారం వరకల్లా తయారై వుండమని తనొచ్చి తీసుకుపోతానని రాశాడు విశ్వేశ్వర్. *